# కార్నివాల్ ఫేర్ కిల్లర్స్

## మధుబాబు



MVS PUBLICATIONS

# కార్నివాల్ ఫర్ కిల్లర్స్

(షాడో స్పై ఎడ్వెంచర్)

రచన

మధుబాబు

© Author

© Madhu Baabu

This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# కార్నివాల్ ఫర్ కిల్లర్స్

తన ఎనిమిది అంగుళాల పొడవున్న శరీరాన్ని నేర్పుగా నీటి దుబ్బు చాటున చేర్చి కాచుకొని వుందా నీటిపాము, ఎంతో ఓర్పుగా, కదలకుండా గంటనుంచీ అలాగే వుంది.

గంటసేపటినుంచీ దానిసే చూస్తున్నాడు షాడో. దాని ఓపికకు నవ్వుకున్నాడు, అది అంతే, ఆఫ్రికా అడవుల్లో బ్రతకాలంటే ఓర్పు అవసరం. ఏ మాత్రం తొందర పడినా, ఏమీ దొరక్కపోగా , ప్రాణాలు పోగొట్టుకొనే అవకాశం వున్నది.

ఉన్నట్లుండి షాడో దృష్టి ఎగురుకుంటూ ఆ నీటిగుంట దగ్గరికి వస్తున్న కప్పమీద పడింది.

కప్పను నీటిలోకి దిగనిచ్చిందా పాము, వింటి నుంచి వెలువడిన బాణంలా వేగంగా ముందుకు దూకింది. పదునైన దాని దవడలు - కప్ప మెడ క్రింద పట్టుపట్టాయి. తన సన్నటి శరీరాన్ని దాని వంటిచుట్టూ మెలిపెట్టింది.

పాము కంటే మూడింతలు పెద్దదైనా - ఆ కప్ప దాని పట్టునుంచి బయటపడలేక పోయింది. క్షణాలమీద పాముకు ఆహారంగా మారిపోయింది.

'తను చేయబోతున్న పనికి మంచి ఉపశ్రుతి ఆ సంఘటన..... ' అనుకుంటూ లేచి ఇవతలకు వచ్చాడు షాడో.

అప్రయత్నంగా అతని ఆలోచనలు రెండు రోజులు వెనక్కు మళ్ళాయి. రెండు రోజుల క్రితం కులకర్ణిగారు చెప్పిన విషయాలు అతని చెవుల్లో మార్మోగాయి.

* * *

"రాజు! ప్రపంచ రాజ్యాల అణ్వాయుధ పోటీని తగ్గించాలని భద్రతా సమితి తీర్మానించింది. ఎవరు ఎటువంటి అణ్వాయుధ పరీక్షలు జరిపినా వెంటనే తెలుసుకొని తగిన విధంగా దండించాలని నిర్ణయించుకున్నది. అందుకు ఆ అణ్వస్త్ర పరీక్షలను డిటెక్ట్ చేసే ఒక ఎలక్ట్రానిక్ బ్రెయిన్ తయారు చేయించటానికి పథకం వేయబడింది."

పనామా సిగరెట్ కాలుస్తూ కులకర్ణి గారి మాటలను శ్రద్ధగా వినసాగాడు షాడో, నెంబర్ వన్ ఏజెంట్ ఆఫ్ ఇండియన్ సి.ఐ.బి.

"అణ్వాయుధాలను తయారు చేసుకోకపోయినా, మనం అణురంగంలో మంచి ప్రగతిని సాధించాం. మన శాస్త్రజ్ఞుల మేధాశక్తి అపూర్వమని ప్రపంచమంతా అంగీకరించింది. అందువల్ల ఆ సాధనాన్ని

తయారు చేసి అంతరిక్షంలో భూమి చుట్టూ పరిభ్రమించేటట్టు చేయవలసిన బాధ్యతను మన దేశానికి వప్పగించింది భద్రతా సమితి.

“ఆరు మాసాలు శ్రమించి మన శాస్త్రజ్ఞులు ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని నిర్మించారు. దాన్ని అంతరిక్షంలోకి పంపిన మరుక్షణం నుంచీ భూమిమీద అణ్వస్త్ర పరీక్షలు జరిగిన వెంటనే కనిపెట్టి హెచ్చరికలు పంపుతుంది.

“నిర్మాణం పూర్తి అయింది. ప్రపంచంలో వున్న వివిధ ప్రదేశాల ఉష్ణోగ్రతలలో అది ఎలా రియాక్ట్ అవుతుందీ అన్న విషయం తెలుసుకోవటం మాత్రం మిగిలిపోయింది. ప్రపంచమంతా తిరిగి పరిశోధనలు పూర్తి చేసుకొని తిరిగి వస్తుండగా - ఆఫ్రికా ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ బ్రెయిన్ వున్న విమానానికి ప్రమాదం వాటిల్లింది.

“రాజు! ఈ ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని ప్రయోగించటం కొన్ని రాజ్యాలకు ఇష్టం లేదు. అటువంటి వారికి ఇది అపూర్వావకాశం. ఆఫ్రికా తీర ప్రాంతాల్లో వున్న జాంబెసీ అరణ్యాల్లో మన విమానం కూలిపోయింది. కూలిపోయే ముందు దాని పైలట్ ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని ఒక పారాచూట్‌కి బిగించి అరణ్యంలోకి వదిలేశాడు. ఆ ప్రదేశాన్ని రేడియో ద్వారా మనకు తెలియచేసి ప్రాణాలు వదిలాడు.

“రేడియో ద్వారా పంపబడిన ఆ వార్త మనకే కాదు - ప్రపంచ రాజ్యాలన్నిటికి వినిపించింది. ఈ ప్రయత్నానికి అయిష్టత చూపుతున్నవారు ఊరికే వుండరు. ఆ బ్రెయిన్‌ని స్వాధీన పరుచుకొని - దాని రహస్యం తెలుసుకుంటారు. మనం మరొక ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని తయరు చేస్తే - వెంటనే దాన్ని నిరుపయోగం చేయగల యాంటీ సాధనాన్ని నిర్మిస్తారు. అలా జరిగిన మరుక్షణం భద్రతా సమితి ప్రపంచ శాంతి భద్రతలను పరిరక్షించటానికి చేపట్టిన పథకాలన్నీ తారుమారు అవుతాయి.

“అందువల్ల ఆ సాధనం మరొకరి చేతికి చిక్కక ముందే మనం వెళ్ళి దాన్ని చేజిక్కించుకోవాలి.”

మాటలు ఆపి సిగార్ వెలిగించుకుంటూ షాడో వంక చూశారు కులకర్ణి. పనామా పొగను రింగులు రింగులుగా వదులుతూ దీర్ఘ ఆలోచనలో పడ్డాడు షాడో. జాంబెసీ అరణ్యంలో కాలు పెట్టడం చాలా ప్రమాదకరం. అడవి జంతువుల బెడద ఒక్కటే కాదు. హెడ్ హంటర్స్ అనబడే అతి భయంకరమైన అడవి జాతి ఆ ప్రాంతాల్లో తిరుగుతూ వుంటుంది. నాగరికులు కనిపించిన మరుక్షణం తలలు నరికి మెడలో హారాలుగా అలంకరించుకుంటారు వారు.

అరణ్యాన్ని, ఆటవిక జాతిని ఏమార్చగలిగినా.... పోటీగా వచ్చే శత్రువులను ఎదుర్కోవటం అసాధ్యం.

కులకర్ణిగారు అన్న 'కొన్ని రాజ్యాలు' అనే మాటకు అర్థం తెలుసుకోవటం ఏమంత కష్టమైన పనికాదు. చైనా, పాకిస్థాన్, ఝరియా, ఇరాన్ మొదలైన దేశాలు... ఎలక్ట్రానిక్ బ్రెయిన్ తయారీకి విముఖత చూపించాయి.

వారి ఏజెంట్లు రంగంలోకి తప్పకుండా దిగుతారు. దానిని శాంతి కాముక రాజ్యాలకు అందనీయకుండా చేయటానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తారు.

కార్నివాల్‌లో కలిసినట్లు జాంబెసీ అరణ్యంలో శత్రువులందరూ పోగవుతారు. ఒకరినొకరు చంపుకోవటానికే ప్రయత్నిస్తారు.

"రాజు! జాంబెసీ అరణ్యం చివర షెర్రా అనబడే చిన్న గ్రామం వుంది. అందులో ఒక కాన్వెంట్ - చర్చి వున్నాయి. అక్కడి ఫాదర్ నీకోసం ఒక గైడ్‌ని ఏర్పాటు చేశాడు. ఆమెకు అరణ్యమంతా బాగా తెలుసు. ఆమె సాయంతో - - - "

కులకర్ణి గారి మాటలు పూర్తికాక ముందే, "నో థాంక్స్ సర్! అక్కడికి వెళ్ళి నా తిప్పలేవో నేను పడతాను. నాకు ఒకరి సాయం అవసరంలేదు" అన్నాడు షాడో.

"నీకు శ్రమ తగ్గుతుందని ఆమెను అరేంజి చేశాం. సంతోషించక ముఖం మాడ్చుకుంటావేం?"

"నాకు శ్రమ తగ్గిస్తున్నమని మీరు అనుకుంటున్నారు. ఆ అడవి పిల్ల వెనకాలపడి పరిగెత్తేసరికి నా ప్రాణాలు పోతాయి. దారి తప్పినప్పుడల్లా - - - వన దేవతల్ని దారి చూపమని ప్రార్థిస్తూ కూర్చుంటే నా గతేం కాను ? నా రివాల్వర్ పేలినప్పుడల్లా బెదిరి పొదలలోకి పారిపోతే నేనేం చెయ్యాలి? నో సర్! నథింగ్ డూయింగ్."

కోపంగా చూసి లేచి నిలబడ్డారు కులకర్ణి. టేబిల్ మీద వున్న ఒక బటన్ నొక్కగానే ఆయన సెక్రటరీ సులోచన పెద్ద అట్ట పెట్ట పట్టుకొని లోపలికి వచ్చింది.

"రాజు... నీకు అవసరం అయ్యే సామానంతా అందులో వుంది. షెర్రా వెళ్ళి ఫాదర్‌ని కలుసుకో. అరేంజి చేసిన ప్లాను ప్రకారం పని పూర్తిచేయి. విష్ యూ బెస్టాఫ్ లక్." షాడో వైపు చూడకుండా చెప్పారు కులకర్ణి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1241**

* * *

**Read other books of Madhubabu @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=20**